# బామ్మగారు - గోగినేని మణి

"బామ్మగారూ... హడావుడిగా వెళ్తున్నారూ... కొంచెంసేపు ఇక్కడ కూర్చుని వెళ్ళండి...! ఆయాసం తగ్గుతుందీ..." అన్నాను దారిన వెళ్తున్న బామ్మగారిని చూసి. పేరేమిటో సరిగా తెలియదు, మా ఊరు వాళ్ళందరికీ ఆమె బామ్మగారే. కొందరు మామ్మగారూ అని కూడా అంటూ ఉంటారు.

బామ్మగారు నా వైపు చిరునవ్వుతో చూసి అరుగుమీద కూర్చున్నారు. ఆ రోజు ఆదివారం కావటంతో స్కూలు లేదు. అమ్మ మాటమీద చదువుకోవటానికని పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నానన్నమాటేగానీ నా దృష్టి ఎక్కువగా రోడ్డుమీద వెళ్ళే వాళ్ళమీదే ఉంటుంది!

బామ్మగారు చిన్నగా నిట్టూర్చి "రిక్షా రంగడు మా ఇంటిదగ్గరే బండి కడతానని అడిగాడుగానీ నాలుగడుగులే కదా... అనవసరం అన్నా. కానీ ఇపుడు తెలుస్తోంది. వయసు పైబడిందని!" అన్నారు. తర్వాత నావైపు అభిమానంగా చూస్తూ "ఇపుడు హైస్కూలు కుర్రాడివేగానీ ముందుముందు పెద్ద చదువులు చదివి ఎంత పెద్ద ఉద్యోగం చేసినా, పెద్దల పట్ల ఇలాంటి ఆదరం, అభిమానం చూపించటం మాత్రం మర్చిపోకురా అబ్బాయ్...!" అని హితవు పలికి తన దగ్గరున్న బ్యాగ్ లో నుండి ఓ వేరుశెనగపప్పు పొట్లం తీసి నా చేతికిచ్చి "తింటూ చదువుకో..." అన్నారు చిరునవ్వుతో.

నాకు చాలా ఆనందం అనిపించింది.

"బామ్మగారూ... నాలుగడుగులు అన్నారు. అంటే.... ఎంతవరకూ...?" నసుగుతూ అడిగాను.

"ఈ వీధి చివరున్న కాశిం ఇంటివరకూ, అంతే...! మూడు రోజులనుండీ వాడు జ్వరంతో మంచంమీదే ఉంటున్నాడని తెలిసింది. ఏవో చిన్న చితకా పనులు చేసి ఏదో ఇంత తెచ్చి పడేసేవాడు, మంచం పడితే ఇద్దరు చిన్న పిల్లలతో ఆ ఇల్లాలు ఏం అవస్థలు పడుతోందో... చూసి పలుకరించి వద్దామనీ...!" అని జవాబు చెప్పారు.

నాకు విషయం అర్థమైంది! సరదాగా అన్నాను “ఏదో, ఏరకో ఆవిడ చేతిలో పెట్టివస్తారు అంతేకదా! నేనిపుడే డొక్కా సీతమ్మగారి గురించి పాఠం చదివాను. మిమ్మల్ని ఇపుడు చూడగానే, ఆవిడనే ప్రత్యక్షంగా చూసినట్లనిపిస్తోందండీ…!”

నా వైపు చురుగ్గా చూస్తూనే చిన్న నవ్వారు. “భలేవాడివిరా… అంత గొప్పావిడతో నాకు పోలికా, విడ్డూరం కాకపోతేనూ…!”

“విడ్డూరం ఏం ఉందండీ…? ఆ మహానుభావురాలు ఎవరు ఎపుడు ఇంటికి వచ్చినా ఆదరంగా అన్నం పెట్టి పంపించేవారట! మీరు అంతేగా… ఎవరికి ఏ అవసరం ఉందని తెలిసినా వెళ్ళి సాయం చేసి వస్తారు!” అన్నాను.

నా మాటలకు బామ్మగారు తలవూపుతూ “నాదేం ఉందిరా… నన్నొదిలి వెళ్ళిపోయిన ఆ మహానుభావుడు నా చేతికి ఇంత బలం ఇచ్చారు కనుకనే ఎవరికైనా అవసరానికి ఎంతోకొంత ఇవ్వగలిగే భాగ్యం నాకు దక్కింది!” అన్నారు.

“అయినా, సంకల్పం మాత్రం మీదేకదా…?” అన్నాను. దానికీ అంగీకరించనట్లు బామ్మగారు తల అడ్డంగా వూపారు “ఇదీ ఆయన సహవాసం వల్ల నాకు అలవడిన గుణమే! ‘మనచుట్టూ ఉన్నవాళ్ళు సమస్యలు లేకుండా నిశ్చింతంగా ఉంటేనే, మనమూ ఆనందంగా ఉండగలుగుతాం’ అని చెబుతూ ఉండేవారు!” అంటూ బామ్మగారు ఒక్కక్షణం ఆకాశం వైపు చూసి చేతులెత్తి దండం పెట్టుకున్నారు!

బామ్మగారు ఏదీ తన గొప్పగా అంగీకరించరు… నేను ఆశ్చర్యంగా చూసాను. మజ్జిగ గ్లాసుతో వచ్చిన మా అమ్మ మా మాటలు విన్నది కాబోలు ‘భార్యాభర్తల్లో ఎవరు  చేసినా, అది ఇద్దరికీ వర్తిస్తుంది’ అంటూ ఆ గ్లాసు ఆవిడకు అందించింది.

బామ్మగారు గడగడా తాగేసి “చల్లగా వర్ధిల్లు తల్లీ” అంటూ దీవించారు. అపుడు నాకో విషయం గుర్తుకు వచ్చింది. మా ఇంట్లో పనులు చేసే నాగమ్మ బామ్మగారు చేసి పెట్టిన మామిడి కాయ, కొబ్బరి పచ్చడి ఎంత రుచిగా ఉందో నూరూరేలా వర్ణించి చెప్పింది. అందుకే నేనూ అన్నాను ”బామ్మగారూ… అమ్మ వాళ్ళు

ఏదైనా ఊరుకు వెళ్లినపుడు మీ ఇంటికి భోజనానికివస్తా. మామిడికాయ కొబ్బరి పచ్చడి చేసి పెట్టాలి మరి!" అంటూ నాగమ్మ మాటల్నీ వివరించాను.

"అదెంత భాగ్యం...!" అంటూ ఆవిడ చిన్నగా నవ్వారు. "అయినా నాగమ్మ మాటల్ని నమ్మకు సుమా! ఆకలి వేళ ఏదైనా అమృతంలాగే అనిపిస్తుంది కదా! ఆరోజు తను వంట చేసుకోలేదని తెలిసి ఇంత భోజనం పెట్టానంతే! నా దగ్గిర ఇంత జాడీ నిండా మామిడికాయ వరుగు ఉంటూవుంటుంది! నీకెపుడు కావలసినా చేసి పెట్టగలను!"

మా అమ్మ వెంటనే అందుకుంది "ఈ మాత్రం దానికి మేం ఊరువెళ్ళాలట్రా...! నిన్ననే మన పెరట్లోని కొబ్బరిచెట్టునుండి కాయలు దింపించానా... నాలుగు కాయలు తీసుకువెళ్ళి బామ్మగారింటిముందు పెడితే, ఆపైనాటికి ఇంత పచ్చడి రాచిప్పతో మనింటికి రాదూ...?"

ఆవిడ చిరునవ్వుతో చూసి "చూశావా... మీ అమ్మ ఎంత చక్కని సూత్రం చెప్పిందో...!" అన్నారు నాతో.

అపుడే అటుగా వెళ్తున్న కృష్ణవేణిని చూసి పిలుస్తూ అరుగుదిగారు. తన బ్యాగ్ తెరిచి... రెండు గులాబీ మొగ్గలు గుచ్చిన పిన్నీసును తనకి అందిస్తూ "నీ బారుజడలో పెట్టుకో అమ్మా. కాసేపటికే అవి విచ్చి... నీ మొహం అంతా కళకళలాడుతుంది!" అన్నారు.

కృష్ణవేణి కూడా ముసిముసి నవ్వుతో అందుకుని జడలో వెంటనే పెట్టేసుకుని తుర్రుమంది. మళ్ళీ వెంటనే ఆ దారినే పోతున్న పిల్లాడిని "సూరీడూ..." అని పిలిచి బ్యాగు నుండి తీసిన రెండు దోర జామకాయలను వీడి చేతిలో పెట్టి "మా గోడ అవతలనుండి ఎందుకురా వగరు పిందెల్ని కోసుకుంటావూ...? ముందు వైపు నుండి వచ్చి నన్ను అడిగితే, చక్కగా ఉన్నవి చూసి కోసి నేనియ్యనా...?" అన్నారు.

బామ్మగారి పెరట్లో జామ, మామిడి లాంటి చెట్లతో పాటూ కొన్ని పూలమొక్కలూ ఉంటాయి! వాటినుండే జామకాయలు, గులాబీ మొగ్గలూ కోసి బ్యాగులో వేసుకుని తెచ్చారన్నమాట!

వాడు ఆనందంగా ఆ కాయల్ని అందుకున్నాక “ఒకటి మీ చెల్లికివ్వటం మాత్రం మర్చిపోకురా...” అని హెచ్చరించి, అమ్మవైపు చూస్తూ “పిల్లలకి చిన్నప్పటినుండీ పంచుకునే అలవాటు మనమే నేర్పించాలి మరి!” అన్నారు.

ఓ రెండు అడుగులు వేసి దారిన పోతున్న వీరయ్యను నిలబెట్టి “మీ ఇంటికి దగ్గరే కదరా.. భద్రయ్య గారికీ విత్తనాల పాకెట్లు ఇచ్చెయ్యి నాయనా... నాలుగు చినుకులు పడ్డాక పెడితే, నాలుగైదు రకాల కూరగాయలు వస్తాయి. వీధి అంతటికీ కూడా సరిపోతాయి...!” అంటూ రెండు కాగితం పొట్లాల్ని బ్యాగునుండి తీసి వాడి చేతికి అందించి వడివడిగా మళ్ళీ నడక సాగించి వెళ్ళిపోయారు.

“బామ్మగారి బ్యాగు అక్షయపాత్రలా ఉంది. అందరికీ కావాల్సినవి తీసి ఇస్తున్నారు...!” అంటూ చిన్నగా నవ్వాను. మా అమ్మకూడా అవునన్నట్లు చిరునవ్వుతో తల వూపింది. ఓ రెండు నిముషాలు మేం ఇద్దరం బామ్మగారి గురించే కబుర్లు చెప్పుకున్నాం.

బామ్మగారి చేతి వంట రుచి చూడని వాళ్ళు, ఆమె సాయం పొందని పేదవాళ్ళూ మా ఊరులో ఎవరూ ఉండరు! తాతగారు పోయాక ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటారు. ఓ చెయ్యి సరిగా పనిచేయక పోవడంతో ఏ పనికీ వెళ్ళని తిమ్మన్న ఎప్పుడు బామ్మగారి ఇంటి ముందే కూర్చుని ఉంటాడు. అపుడపుడూ ఊరంతా బలాదూరు తిరిగి వస్తూంటాడు. బామ్మగారు తనతో పాటే పెట్టేదేదో తింటూ ఉంటాడు.

ఎవరికి ఒంట్లో బాగాలేకనో, ఇంట్లో ఏమీ లేకనో వంట చేసుకోలేదని తెలిస్తే మాత్రం బామ్మగారు వాళ్ళని పిలిచి కడుపునిండి భోజనం పెడతారు! ఇక తిమ్మనకైతే ప్రతీరోజూ తప్పనిసరే!

బామ్మగారి ఇల్లు చిన్నదే అయినా పక్కగా స్థలం ఎక్కువగా ఉంటుంది. ఆ ఖాళీ స్థలంలో జామ, మామిడిలాంటి చెట్లే కాకుండా ఏవో కూరగాయల మొక్కలు, పాదులు చాలానే ఉంటాయి. ప్రతీరోజూ వాటి సంరక్షణే బామ్మగారికి కాలక్షేపం! ఆ కూరగాయలన్నీ అందరిళ్ళకూ చేరుతుంటాయి!

ఒకరోజు... మా స్కూలు లోనే నాకుసీనియర్ అయిన కామేశం “ఆ బామ్మ మీ ఇంటికి ఎందుకురా తరచూ వస్తూ ఉంటుంది?” అని నన్నడిగాడు. నేను “అదేం లేదే, బామ్మగారు వీధిలోనుండి ఎపుడు వెళ్ళటం చూసినా మేమే పలుకరిస్తూంటాం... అంతే...!” అని జవాబు చెప్పాను.

వాడు నా వైపు చిరాగ్గా చూస్తూ "ఆవిడ ఈ ఊరికంతటికీ తనే ఓ పెద్ద ప్రవచనకర్తనన్నట్లు ఏవో నీతులు, సూక్తులూ చెబుతూ ఉంటుంది! నాకు చాలా చిర్రెత్తుకొస్తుంది ఆవిడ మాటల్ని వినటం. ఎపుడో సమయం చూసి బాగా బుద్ధి చెబుతాను!" అంటూ నిర్లక్ష్యంగా తలెగరేసాడు!

నేను నివ్వెరపోయాను!

కామేశం మాటలకు నాకు కొంచెం కోపము వచ్చింది. "అదేంటి కామేశం... అలా అంటున్నావ్...? బామ్మగారు తనకి తోచిన మంచి మాటలు చెప్పటం అలవాటేమోగానీ ఎవ్వరికీ చెడు చేయటం లేదుగా? నీకెందుకూ అంత చిరాకు... నిన్నేమైనా అన్నారా?"

నా మాటలకు కామేశం ఎర్రగా చూస్తూ "మీకూ మీకూ బంధుత్వం ఉన్నట్లుందికదా, ఇలా గాకుండా ఇంకెలా మాట్లాడతావ్ లే..." అంటూ విసవిసా వెళ్ళిపోయాడు.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది ! బామ్మగారి గురించి అందరూ గొప్పగా అనుకుంటారని నా అభిప్రాయం! కానీ... ఆవిడ మాటలకు ఇలా చిరాకు పడేవాళ్ళూ ఉంటారన్న మాట! అయినా పెద్దావిడ ఏదో చెబితే విని ఆచరిస్తే చేస్తాం... లేకపోతే లేదు... విని మర్చిపోతాం... అంతేగా! ఆ మాత్రం దానికి కోపం ఎందుకూ... నాకేం అర్థం కాలేదు! ఒంటరిగా వుంటూ నలుగురికీ చేయగలిగిన సాయం చేస్తూ బ్రతుకుతున్న ఆవిడపై కోపం, కక్ష ఏమిటీ... కామేశం బుద్ధి ఎలా చెబుతాడు...?

విచిత్రంగా అనిపించిన నా సందేహానికి సమాధానం ఆ తర్వాత నాలుగురోజులకే దొరికింది!

ఆ రోజు బామ్మగారి పెరట్లోని మొక్కలన్నిటినీ పీకి పారేసి పెరడంతా చిందరబందర చేసేసారెవరో! బామ్మగారింటి పక్క స్థలానికి ఆనుకుని ఆనందరావు గారిల్లు ఉంటుంది. ఈ మధ్యకాలంలో విదేశంలో ఉంటున్న వాళ్ళబ్బాయి సి.సి. కెమెరా తెచ్చి వాళ్ళింటికి అమర్చాడట. వాళ్ళు దానిలో చూసి కామేశం పనే అని తేల్చి చెప్పారు. గోడదూకి వాడు వెళ్ళటం దానిలో వాళ్ళకి స్పష్టంగా కనిపించిందట! బామ్మగారికి పొద్దున్నే గుడికి వెళ్ళే అలవాటు ఉంది. ఆ సమయంలో జరిగిందన్న మాట.

తిమ్మన్న కూడా ఎక్కడికో వెళ్ళి వస్తూ... కామేశం గోడదూకి పారిపోవటం చూసానని చెప్పాడు. చేరిన జనం అంతే తలోమాటా అన్నారు. ఎవరో ఒకరు రిపోర్టు చేసారేమో పక్కవీధిలోనే ఉండే పోలీసూ

ప్రత్యక్షమయ్యాడు. కామేశాన్ని వెంటబెట్టుకుని బామ్మగారింటికి వచ్చాడు. విషయం విని నేనూ చేరానక్కడికి. కామేశం చేసిన పనేనని నాకూ అర్థమైంది!

బామ్మగారు పోలీసుతో అన్నారు "ఇదేమిటి బాబూ మీరొచ్చారూ ఇంత చిన్న  దానికీ! నేనే... ఆ అబ్బాయిని ఎపుడైనా సమయం ఉన్నపుడు కలుపు తీసి పెట్టమని చెప్పా. నేనింట్లో లేకపోవటంతో గోడ దూకి వెళ్ళాడు కాబోలు! అంతే! ఇదంతా కోతిమూక పనే అయివుంటుంది! మొన్నామధ్య కూడా వచ్చి మొక్కల మీద పడితే, నేనే బెదరగొట్టా. మళ్ళీ వచ్చి పాడుచేసి ఉంటాయి! పిల్లాడు కదా, వీడూ వాటిని చూసి ఆ భయంతో పారిపోయి ఉంటాడు! అదే, మా తిమ్మన్న చూసి చెబుతున్నాడన్నమాట! అంతే...! " అంటూ బామ్మగారు తేల్చి చెప్పేసరికి 'అవును... కాబోలంటూ' జనం అంతా పోలీసుతో పాటూ వెళ్ళిపోవటం జరిగింది.

నాకు మాత్రం విషయం తెలుసుగనుక ఆఖరున బామ్మగారిని అడిగాను "ఎందుకలా చెప్పారూ? తప్పు చేసిన వాడికి శిక్ష పడాలి కదండీ...?"

ఆవిడ చిరునవ్వుతో చెప్పారు "బావుందిరా... పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంలా ఈ మాత్రం దానికి శిక్ష వేయాలంటావా...? తప్పు తెలుసుకుంటే చాలు కదా అనిపించింది! నామాటలకు... వాడి కళ్ళల్లో కనుపించిన నీటిచెమ్మా... దించుకున్న మొహంలోని పశ్చాత్తాపభావం  చాలదా...! నా చేయి ఆసరాతో ఎవరైనా లేచి నిలబడగలిగితే, నాకు సంతోషంగానీ, ఇంత చిన్నపనికి శిక్షించి, వాడి భవిష్యత్తును పాడుచేయటం నాకూ బాధే కదరా...?"

నాకు ఆశ్చర్యం కలుగలేదు! నేనూహించిన సమాధానమే! చిన్న విషయమే అయినా బామ్మగారి వ్యక్తిత్వం ఎలాంటిదో ఆ సంఘటన తెలియజేసింది! సామాన్యమైన వ్యక్తులలోను అసామాన్యమైన వ్యక్తిత్వం కలవారూ ఉంటారుమరి! అపకారికి ఉపకారము అనే పద్యపాదం గుర్తుకు వచ్చింది కూడా! ఆమరునాడే కామేశం మాత్రమే కాకుండా వాడి కుటుంబం అంతా వచ్చి బామ్మగారి పెరడు అంతా బాగుచేసారనీ, మొక్కలేవో నాటారనీ విన్నాక చాలా సంతోషించాను ! క్షమాగుణంతో కూడా మనుష్యుల్లో పరివర్తన తీసుకురావటం మహానుభావులకే చెల్లుతుంది.

* * *

ఇదంతా ఎపుడో జరిగినది. నాకపుడు గుర్తుకు వచ్చింది!

నా ఎదురుగా కుర్చీలో కూర్చున్న పెద్దాయన "ఏమిటి కలెక్టరుగారూ... నన్నుకూర్చోమని చెప్పి... మీరేదో ఆలోచనలో పడ్డారూ...?" అని అడగటంతో ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చాను. బామ్మగారు నాకు ఒకప్పుడు... పెద్దల పట్ల ఆదరం చూపించటం మర్చిపోవద్దని చెప్పిన మాట గుర్తుకు వచ్చి... అభ్యర్థనగా నా సాయంకోరి... నిలబడి మాట్లాడుతున్న ఆయనను కూర్చోమని చెప్పి గతంలోకి జారుకున్నానన్నమాట... "ఇపుడు చెప్పండీ... ఏం పని మీద వచ్చారూ...?" అని వారిని ఆదరంగా అడిగాను.

* * *